- అన్నదాత ఇంట కేసీఆర్‌పై అభిమానం




సంక్రాంతి పండుగ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఓ అన్నదాత అభిమానం చాటుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటకు చెందిన రైతు లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి తన ఇంటి ముందు 'మళ్లీ కేసీఆర్ రావాలి.. వ్యసాయం పండుగ కావాలి' అనే ముగ్గులు వేయించాడు. – గంభీరావుపేట

- రేవంత్‌కు ముగ్గులతో నిరసన




సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని దుద్యాల మండలం లగచెర్ల, హకీంపేట, పోలెపల్లి, రోటిబండతండా, పులిచెర్లకుంటతండా వాసులు సంక్రాంతి వేళ వినూత్న నిరసన తెలిపారు. తమపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, భూసేకరణ ఆపాలని ముగ్గులు వేసి తమ ఆవేదన వెలిబుచ్చిన రోటిబండ తండా రైతులు. – కొడంగల్

- కాంగ్రెస్ పార్టీ గోవిందా.. హామీలన్నీ గోవిందా



'కాంగ్రెస్ పార్టీ గోవిందా.. రేవంత్‌రెడ్డి గోవిందా' అంటూ ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) గ్రామస్థులు మంగళవారం ముగ్గులు వేసి నిరసన తెలిపారు. 'రైతు భరోసా గోవిందా.. తులం బంగారం గోవిందా.. రుణమాఫీ గోవిందా.. రూ.4 వేల పింఛన్ గోవిందా.. మహాలక్ష్మి రూ.2500 గోవిందా.. ఆరు గ్యారెంటీలు గోవిందా..' అంటూ ముగ్గులు వేశారు. ఆరు గ్యారెంటీలను నమ్మి మోసపోయామని, రైతు భరోసా రూ.15 వేలు ఇస్తానని చెప్పి రెండు సీజన్లు ఎగ్గొట్టారని ముగ్గుల ద్వారా తమ ఆవేదనను తెలిపారు. –ఇచ్చోడ

## విద్యార్థులు రారు.. క్లాసులు జరగవు

- ఎగ్జామ్స్‌కు ప్రిపేరవ్వాల్సిన సమయంలో పనులకు
- సర్కారు కాలేజీల్లో పడిపోతున్న విద్యార్థుల హాజరుశాతం



హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ) : సర్కారు జూనియర్ కాలేజీల్లోని విద్యార్థుల్లో అత్యధికులు తరగతులకు డుమ్మా కొడుతున్నారు. చదువుకుని బాగుపడాలని బుద్ధిమాటలు చెప్పాల్సిన తల్లిదండ్రులే విద్యార్థులను పనులకు పురమాయిస్తున్నారు. వారు సైతం పుస్తకాలకు నో చెప్పి.. పనులకు సై అంటున్నారు. ఫలితంగా హాజరుశాతం 40–50లోపే ఉంటున్నది. ఇంటర్ వార్షిక పరీక్షలు మార్చి 5 నుంచి 24 వరకు జరగనున్నాయి. పరీక్షలకు మరో మూడు నెలలు మాత్రమే ఉంది. ప్రిపేరవ్వాల్సిన సమయంలో పనులకెళ్లడంతో సర్కారు కాలేజీల్లో ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముంది. ఇప్పటికే ఇంటర్‌లో ఉత్తీర్ణతాశాతం అంతంతమాత్రంగానే ఉంది. జోగులాంబ గద్వాల జిల్లాలోని మానవపాడు, గట్టు ప్రాంతాల్లోని విద్యార్థులు కాలేజీలకు డుమ్మా కొట్టి పత్తి ఏరడానికి వెళుతున్నారు. అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న వారు ఇప్పపువ్వు, బీడీ ఆకు సేకరణ పనులకు వెళుతున్నట్టు క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టంచేస్తున్నాయి. పరీక్షలు సమీపిస్తుండటంతో అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లల్లో టెన్షన్ నెలకొన్నది.

ఉదాహరణలిలా..

- కరీంనగర్ జిల్లా చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 126 మంది విద్యార్థులుండగా, రోజు 80 మంది విద్యార్థులు మాత్రమే క్లాసులకొస్తున్నారు. ఉదయం 10 గంటలకు వచ్చేవారి సంఖ్య 50శాతం లోపే. మధ్యాహ్నం తర్వాత హాజరయ్యే విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది.
- సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో రోజువారి హాజరుశాతం 40లోపే ఉంది. ఇటీవలే పరీక్షలు సమీపిస్తుండటంతో అధికారుల ప్రయత్నాలతో హాజరుశాతం కాస్త మెరుగైంది. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 183 మంది విద్యార్థులుంటే. ఓ రోజు ఉదయం 10 గంటలకు 10 మంది మాత్రమే క్లాసులకు హాజరయ్యారు. ఆ తర్వాత 20, చివరికి మధ్యాహ్నం 12గంటలకు 40 మంది మాత్రమే క్లాసులకు హాజరయ్యారు.
- ప్రభుత్వ జూనియర్ కాలేజీ వంగూరులో వంద మంది విద్యార్థులకు కేవలం 10 మంది మాత్రమే క్లాసులకు హాజరవుతున్నారు. అంటే పదిశాతం మంది మాత్రమే ఈ కాలేజీలో క్లాసులు వింటున్నారు.
- పట్టణ ప్రాంతమైన కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 600 మంది విద్యార్థులుంటే సగం మంది క్లాసులకు డుమ్మా కొడుతున్నారు. 300 మంది మాత్రమే హాజరవుతున్నారు.
- ప్రభుత్వ జూనియర్ కాలేజీ అమ్రాబాద్‌లో 300 మందికి కేవలం 30 మంది మాత్రమే హాజరయ్యారు. ఎందుకు క్లాసులకు హాజరుకావడంలేదని ప్రశ్నిస్తే ఇప్పపూల సేకరణ, వేరుశనగ కాయలు తెంపేందుకు వెళుతున్నట్టుగా సమాచారం.

## ఊరూరా సారా!

- 13 జిల్లాల్లో తయారు చేస్తున్నట్టు గుర్తింపు
- స్పెషల్ డ్రైవ్‌కు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రణాళిక
- నేటి నుంచి ఫిబ్రవరి 15 వరకు కొనసాగింపు

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని గుడుంబారహితంగా తీర్చిదిద్దేందుకు గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గుడుంబా తయారీపై ఉక్కుపాదం మోపింది. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో నాటుసారా మళ్లీ తయారు చేస్తున్నట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గుర్తించింది. దానిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 13 జిల్లాల్లోని 25 మండలాల పరిధిలో మళ్లీ నాటుసారా తయారవుతున్నట్టు సమాచారముందని తెలిపారు. నేటి నుంచి ఫిబ్రవరి 15 వరకు ప్రభావిత జిల్లాల్లో ఆకస్మిక దాడులు చేపట్టాలని ఎక్సైజ్ స్టేషన్‌ల అధికారులను ఆదేశించారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలతో పాటు ముడిసరుకు సరఫరా చేసేవాళ్ల సమాచారాన్ని కూడా సేకరించాలని పేర్కొన్నారు. ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. చెన్నూర్, లక్షెట్టిపేట, మహబూబ్‌నగర్, బెల్లంపల్లి, వనపర్తి, కొత్తకోట, అచ్చంపేట, తెలకపల్లి, కల్వకుర్తి, పరకాల, నర్సంపేట్, వర్ధన్నపేట, తొర్రూర్, గూడేరు, ములుగు, కాటారం, భూపాలపల్లి, దేవరకొండ, భద్రాచలం, సుల్తానాబాద్, ధర్మపురి, నిర్మల్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించాలని అదేశాలు జారీ చేశారు.

## మార్టిగేజ్ కోసం 5 వేలు లంచం

**ఏసీబీకి చిక్కిన మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్**

మెట్‌పల్లి, జనవరి 15: మార్టిగేజ్ కోసం రూ.5 వేలు లంచం తీసుకుంటూ బుధవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ కరీంనగర్ డీఎస్పీ రమణామూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్‌కు చెందిన సుంకే విష్ణు బ్యాంకు ఉద్యోగి. మెట్‌పల్లిలో 266 గజాల ఇంటి స్థలం సేల్ డీడ్, మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ కోసం డాక్యుమెంట్ రైటర్‌తో దస్తావేజులు తయారు చేయించారు. గత నెల 28న డాక్యుమెంట్ రైటర్ వద్ద సహాయకుడిగా పనిచేసే ఆర్మూర్ రవి సబ్‌రిజిస్ట్రార్ మహమ్మద్ అసిఫొద్దీన్ వద్దకు సదరు దస్తావేజులను తీసుకెళ్లాడు. సేల్‌డీడ్, మార్టిగేజ్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారు. అయితే విష్ణు డబ్బులు ఇవ్వకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయకుండా పక్కన పెట్టారు. చివరకు రూ.5 వేలకు ఒప్పందం కుదిరింది. విష్ణు డాక్యుమెంట్ రైటర్ సహాయకుడి ద్వారా సబ్‌రిజిస్ట్రార్ వద్దకు వెళ్లగా.. అటెండర్ బానోతు రవికుమార్‌కు డబ్బులు ఇవ్వాలని సూచించారు. సబ్‌రిజిస్ట్రార్ చెప్పినట్టుగానే అటెండర్‌కు రూ.5 వేలు లంచం ఇస్తుండగా, ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ మహమ్మద్ అసిఫొద్దీన్, అటెండర్ రవికుమార్‌తోపాటు డాక్యుమెంట్ రైటర్ సహాయకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ముగ్గురిని కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.



పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, డాక్యుమెంట్ రైటర్ సహాయకుడు

## పీసీవోఎంగా పద్మజ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్(పీసీవోఎం)గా పద్మజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె 1991 ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీసెస్ బ్యాచ్‌కు చెందిన వారని రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఆమె ఎస్‌సీఆర్ ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మజ

## 'కాళేశ్వర ముక్తేశ్వర' అభివృద్ధికి సహకరించండి

**కేంద్ర మంత్రి షెకావత్‌కు శ్రీధర్‌బాబు విజ్ఞప్తి**

హైదరాబాద్, జనవరి 15(నమస్తే తెలంగాణ): 'కాళేశ్వరం–మంథని–రామగిరి'ని ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్‌గా గుర్తించి అభివృద్ధి చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన శ్రీధర్‌బాబు మంథని నియోజకవర్గంలోని కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం, రామగిరికోటను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చొరవ చూపాలని వినతిపత్రం అందజేశారు.

## లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభల ఆమోదం తప్పనిసరి : సీఎస్

హైదరాబాద్, జనవరి 15(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న 4 పథకాలకు లబ్ధిదారుల జాబితా ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహించే గ్రామసభల్లో ఆమోదం పొందాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లను ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ఈ నెల 26న ప్రారంభించాలని నిర్ణయించిన నేపథ్యంలో అమలు కార్యాచరణపై బుధవారం జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్షించారు. లబ్ధిదారుల ఎంపికకు క్షేత్రస్థాయిలో తనిఖీల అనంతరం వివరాలను గ్రామసభల్లో ప్రదర్శించి ఆమోదం పొందాలని సీఎస్ సూచించారు.

## నెలాఖరులో నామినేటెడ్ పదవులు

**టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్**

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): నామినేటెడ్ పదవులకు ముహూర్తం ఖరారైంది. ఈ నెలాఖరుకు పదవులు భర్తీ చేయనున్నట్టు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ నెలాఖరులోపు పీసీసీ కార్యవర్గ ఏర్పాటు కూడా పూర్తి చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కాంగ్రెస్ రాష్ట్ర నేతలు గంటన్నర పాటు భేటీ అయ్యారు. కాంగ్రెస్ పాలన, హామీల అమలుపై సమీక్షించారని, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపు కోసం పని చేయాలని దిశానిర్దేశం చేశారని తెలిపారు.

## పరిశ్రమల శాఖలో సమాచార అధికారులు వీరే

హైదరాబాద్, జనవరి 15(నమస్తే తెలంగాణ): పరిశ్రమలు, వాణిజ్య శాఖలోని పలువురు అధికారులను అప్పిలేట్ అథారిటీ, పబ్లిక్ ఇన్ఫర్మేషన్, అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లుగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. సమాచార హక్కు చట్టం అమల్లో భాగంగా పరిశ్రమల శాఖ ఉప కార్యదర్శి ఏవీఎన్ రమేశ్ కుమార్‌ను అప్పిలేట్ అథారిటీగా, సహాయ కార్యదర్శులు ఎం సత్యనారాయణ, బీజీ సుమతిని సహాయ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులుగా నియమించారు.

## పరిశ్రమల రక్షణలో సవాళ్లు అధిగమించాలి

**డీజీ రాజ్‌విందర్ సింగ్ భట్టి**

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): పరిశ్రమల భద్రతలో సవాళ్లను అధిగమించేందుకు, రక్షణ అంశాల్లో ఆధునికతను సంతరించుకునేందుకు సీఐఎస్‌ఎఫ్ దళాలు నిత్యం సంసిద్ధంగా ఉండాలని సీఐఎస్‌ఎఫ్ డీజీ రాజ్వీందర్‌సింగ్ భట్టి సూచించారు. హైదరాబాద్‌లోని నిసా క్యాంపస్‌లో శిక్షణ పొందుతున్న 37వ బ్యాచ్ అసిస్టెంట్ కమాండెంట్లు, 20వ బ్యాచ్ కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజ్వీందర్‌సింగ్ హాజరై క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.



మహాసభలో పాల్గొన్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు

## పేపర్ బాయ్స్ సంక్షేమానికి కృషి చేయాలి

**ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్, పేపర్‌బాయ్స్ అసోసియేషన్ డిమాండ్**

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 15(నమస్తే తెలంగాణ): పేపర్ బాయ్స్, డిస్ట్రిబ్యూటర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్, పేపర్ బాయ్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. మౌలాలిలోని కలర్స్ ఫంక్షన్ హాల్స్‌లో బుధవారం రెండో రాష్ట్ర మహాసభ నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ పేపర్ పంపిణీ ద్వారా 30 వేల మంది ఉపాధి పొందుతుండగా, చాలా మంది కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 80శాతం సబ్సిడీతో ఈ–చార్జింగ్ మోటార్ సైకిళ్లను పంపిణీ చేయాలని, పత్రిక లోడింగ్, పంపిణీ కోసం రైతుబజార్ తరహా సేఫ్టీ షెడ్లను నిర్మించాలని తెలిపారు. కార్మికులకు రూ.10లక్షల ఆరోగ్య బీమా, రూ.20లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు వనమాల సత్యం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్‌రావు పాల్గొన్నారు.

## మూసీలోకి వ్యర్థాలు.. చూసీచూడనట్టు అధికారులు

- మూసీలోకి యథేచ్ఛగా రసాయన వ్యర్థాలు
- నామమాత్రపు తనిఖీలతో పీసీబీ నిర్లక్ష్యం
- పరిశ్రమలకు సహకరిస్తున్న అధికారులు!
- ప్రభుత్వానికి యాదాద్రి జిల్లా రైతుల ఫిర్యాదు

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): మూసీలో రసాయన వ్యర్థాలు వదులుతున్న పరిశ్రమలపై, సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రైతు నాయకుడు గుమ్మి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధిత రైతులు ముఖ్యమంత్రి కార్యాలయం, అటవీ, పర్యావరణశాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అటవీశాఖ ముఖ్యకార్యదర్శికి ఫిర్యాదు చేశారు. చౌటుప్పల్ మండలం అంతమ్మగూడెంలోని జయ ల్యాబొరేటరీ పరిశ్రమ వద్ద గత డిసెంబర్ 10న, 23న అధికారులు తనిఖీలు నిర్వహించారని, ఆ తర్వాత నిలిపివేశారని పేర్కొన్నారు. మధ్యలో 12 రోజులు సమయం ఇవ్వడంతో పరిశ్రమ యాజమాన్యం రసాయనిక వ్యర్థాలను మూసీలోకి వదిలిందని తెలిపారు. పరిశ్రమలోని గేట్ రిజిస్టర్, సీసీటీవీ దృశ్యాలను తనిఖీ చేయాలని కోరినా పీసీబీ అధికారులు పరిశ్రమ యజమానులతో కుమ్మక్కయ్యి పట్టించుకోలేదని ఆరోపించారు. అంతమ్మగూడెం సమీపంలోని హజెలో, బృందావన్, కెమిక్, శ్రీజయ పరిశ్రమలు మూసీ కాలుష్యానికి కారణమవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**బోరుబావుల్లో విషం... అధికారుల నిర్లక్ష్యం**

బోరు బావుల్లోని నీటిలో ఎలక్ట్రికల్ కండక్టివిటీ 43వేలు, టీడీఎస్ 27వేలకు పైగా పెరిగినప్పటికీ అధికారులు కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడంలేదని రైతులు వెల్లడించారు. 6 నెలల్లోనే 2 పరిశ్రమల నుంచి 100కు పైగా ట్యాంకర్ల ద్వారా రసాయనాలను మూసీలో వదిలేసినా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని తెలిపారు. పీసీబీ అధికారులు పరిశ్రమల నుంచి ఏటా 60 వేలకు పైగా నమూనాలు సేకరించాల్సినప్పటికీ 10శాతం కూడా సేకరించడంలేదని వివరించారు. ఒక పరిశ్రమ తనిఖీకి కనీసం 4 నుంచి 8 గంటల సమయం పడుతుందని, కానీ ఒకే అధికారి ఒకే రోజులో నాలుగైదు పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించి, ఇష్టమొచ్చినట్టుగా నివేదికలు రాస్తున్నారని చెప్పారు. పీసీబీ అధికారులు తనిఖీలు సక్రమంగా నిర్వహించి, పారదర్శకంగా నివేదికలు రూపొందించాలని డిమాండ్ చేశారు. గ్రామ సమీపంలో కాలుష్యాన్ని గుర్తించేందుకు మానటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఫిర్యాదులో కోరారు.



## మిసెస్ ఇండియాగా నాగర్‌కర్నూల్ జిల్లావాసి

**మరో రెండు టైటిల్స్ కూడా సుష్మారెడ్డి సొంతం**

వెల్దండ, జనవరి 15 : మిసెస్ ఇండియాగా నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం రాచూర్ గ్రామానికి చెందిన సూదిని సుష్మారెడ్డి నిలిచారు. 2025 సంవత్సరానికి గాను మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఫైనల్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి పోటీలో నిలిచిన సుష్మారెడ్డి మిసెస్ ఇండియా కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. మోస్ట్ పాపులర్, మోస్ట్ డెలిగేట్స్ టైటిల్స్‌ను సైతం ఆమె దక్కించుకున్నారు. డాక్టర్ వృత్తిలో ఉన్న సుష్మా మిసెస్ ఇండియా కిరీటాన్ని కైవసం చేసుకోవడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## కూనంనేనికి సుప్రీంలో చుక్కెదురు

- సాంబశివరావు ఎన్నికల అఫిడవిట్‌పై రగడ
- క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు మెట్లు ఎక్కినా ఆయనకు ఊరట లభించలేదు. తన ఎన్నికల అఫిడవిట్‌పై దాఖలు చేసిన పిటిషన్‌ను క్వాష్ చేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వివరాల్లోకి వెళ్తే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన కూనంనేని తన అఫిడవిట్‌ను సరిగ్గా దాఖలు చేయలేదంటూ కొత్తగూడేనికి చెందిన నందులాల్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. కూనంనేనిని అనర్హుడిగా ప్రకటించాలని తన పిటిషన్‌లో కోరారు. దీంతో కూనంనేని సాంబశివరావు ఆ పిటిషన్‌ను క్వాష్ చేయాలని గతంలో హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తులు పిటిషన్‌ను క్వాష్ చేయడానికి నిరాకరించారు. దానిపై విచారణ జరగాలని తేల్చారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ కూనంనేని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం పిటిషన్‌ను క్వాష్ చేయలేమని, విచారణ జరగాల్సిందేనని పేర్కొంది. ఈ మేరకు కూనంనేని దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో నందులాల్ వేసిన పిటిషన్ మరికొద్ది రోజుల్లోనే విచారణకు వచ్చే అవకాశం ఉంది.



సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం కైట్ ఫెస్టివల్ నిర్వహించింది. నగరవాసులు పెద్దసంఖ్యలో హాజరై సందడి చేశారు. రంగురంగుల పతంగులు ఎగురవేశారు. చిన్నచిన్న గాలిపటాలతో పాటు భారీ, విభిన్నమైన పతంగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కాలేజీలకు రిలీఫ్

- ఫైర్ ఎన్‌వోసీ నుంచి మినహాయింపు
- ఇంటర్ బోర్డు గుర్తింపునకు మార్గం సుగమం

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ ) : మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ భవనాల్లో ఉన్న ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు రాష్ట్రప్రభుత్వం మరోసారి మినహాయింపు ఇచ్చింది. 2024–25 విద్యాసంవత్సరానికిగానూ ఫైర్ నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) నుంచి మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు 217 కాలేజీలకు ఊరట లభించింది. రాష్ట్రంలో మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ భవనాల్లో ఉన్న కాలేజీలకు ఫైర్ ఎన్‌వోసీ మినహాయింపు గత విద్యాసంవత్సరంతో ముగిసింది. ఈ ఏడాది ఆయా కాలేజీలకు ఇంటర్ బోర్డు నుంచి గుర్తింపు దక్కకపోవడంతో విద్యార్థుల భవితవ్యం ఆందోళనకరంగా మారింది. ఈ కాలేజీల్లో సెకండియర్ విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపునకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం ఫస్టియర్ విద్యార్థుల విషయంపై మాత్రం ఎటూ తేల్చలేదు. ఫస్టియర్ విద్యార్థులు పరీక్షలు రాస్తారా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కాలేజీలకు అనుమతివ్వాలన్న ప్రైవేట్ కాలేజీల విజ్ఞప్తితో ఈ ఒక్క విద్యాసంవత్సరానికి అనుమతినిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 70 వేల మంది విద్యార్థులకు ఊరట కలిగింది.

## తెలంగాణ ఇన్‌సర్వీస్ వైద్యులకు సుప్రీంకోర్టులో ఊరట

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఇన్‌సర్వీస్ వైద్యులకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఇతర ప్రాంతాల్లో ఎంబీబీఎస్ చదివిన తెలంగాణ స్థానికత గల ఇన్‌సర్వీస్ వైద్యులకు పీజీ చేయడానికి లైన్‌క్లియర్ అయ్యింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టికల్ 371డీ, జీవో 16ప్రకారం స్థానికంగా చదివిన ఇన్‌సర్వీస్ వైద్యులకు ఉన్నత విద్యలో లోకల్ కింద 85శాతం రిజర్వేషన్, ఇతర ప్రాంతాల్లో చదివిన వారికి అన్‌రిజర్వ్‌డ్ కింద 15శాతం అడ్మిషన్లకు అవకాశం కల్పించేవారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా అవే నిబంధనలు కొనసాగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నిబంధనలను ఎత్తేసింది. దీంతో తెలంగాణ స్థానికత కలిగినప్పటికీ ఇతర ప్రాంతాల్లో ఎంబీబీఎస్ చదివిన ఇన్‌సర్వీస్ వైద్యులకు పీజీ చేసే అవకాశం లేకుండా పోయింది. దీనిపై వైద్యులు హైకోర్టును ఆశ్రయించినా ఫలితం దక్కకపోవడంతో సుప్రీంకోర్టు మెట్లెక్కారు. ఈ మేరకు విచారించిన అత్యున్నత న్యాయస్థానం తెలంగాణ స్థానికత కలిగి, ఇతర ప్రాంతాల్లో ఎంబీబీఎస్ చేసిన ఇన్‌సర్వీస్ వైద్యులకు పీజీ వైద్యవిద్య అడ్మిషన్లలో అవకాశం కల్పించాలని బుధవారం తీర్పు చెప్పింది

## సుప్రీంకోర్టులో చంద్రబాబుకు ఊరట

హైదరాబాద్, జనవరి 15 (నమస్తేతెలంగాణ): ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు సుప్రీంకోర్టులో ఊరట దక్కింది. స్కిల్ కేసులో బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం కొట్టివేసింది. ఈ కేసులో ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ చార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని ధర్మాసనం పేర్కొన్నది. ఈ మేరకు గత ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సుప్రీంకోర్టు సూచించింది. చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ఇంటర్ లొకేటరీ అప్లికేషన్ దాఖలు చేసిన ఓ పత్రికా విలేకరి బాలగంగాధర్ తిలక్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది.